ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 26.0 | కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY 7
నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
శుక్రవారం 11 అక్టోబరు 2024





బతుకమ్మను తలపై పెట్టుకున్న గద్వాల కలెక్టర్ సతీమణి కెచేరి





నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ అంటూ బతుకమ్మ పాటలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు ఆడిపాడారు. వీరితో పాటు పురుషులు కూడా వారికి తగ్గట్టుగా బతుకమ్మ ఆడటం చూపరులను ఆకట్టుకున్నది. జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. గద్వాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద, అలాగే తేరు మైదానంలో గురువారం సద్దుల బతుకమ్మ సంబురాలను ఉత్సాహంగా నిర్వహించారు. కలెక్టర్ బీఎం సంతోష్ సతీమణి డాక్టర్ కెచేరితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయంతో కలిసి గౌరీమాతకు పూజలు నిర్వహించి బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలను మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. మైదానంలో బతుకమ్మ ముందు ఆడిపాడారు. న్యూ ప్రేమ్ నగర్ లోని గంగపుత్ర మహిళా సంఘం సభ్యులు తీరొక్క పూలవనాన్ని పేర్చి బతుకమ్మను ఆడారు. జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

– నాగర్‌కర్నూల్(ఆంధ్రజ్యోతి), గద్వాల న్యూటౌన్, మహబూబ్‌నగర్ న్యూటౌన్



నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలలో జిల్లా అధికారులు, మహిళా అధికారులు



భక్తులకు మహాగౌరీదేవిగా దర్శనమిచ్చిన జోగుళాంబ అమ్మవారు



ఉమామహేశ్వరంలో మహాగౌరీదేవిగా భ్రమరాంబిక

మహాగౌరీదేవిగా దర్శనం

అలంపూరు/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూరు జోగుళాంబ అమ్మవారు గురువారం మహాగౌరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి దర్బారు సేవ, కొలవు పూజలో సువాసిని పూజ, కుమారి పూజ, మహా మంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం వారు అమ్మవారి ఆలయ ప్రాకారం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. అదేవిధంగా, ఉమామహేశ్వర క్షేత్రంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు మహాగౌరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయ ఈవో శ్రీనివాసరావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు ఐదు వందల మందికి అన్నదానం చేశారు.

ఆలయ సిబ్బంది రామకృష్ణ, లక్ష్మీనారాయణ, అంజయ్య కవికుమార్, దామోదర్ శంకర్ ఉన్నారు.





తప్పిన పెను ప్రమాదం

» పెంట్లవెల్లి శివారులో పడిన పిడుగు

కొల్లాపూర్, అక్టోబరు 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండల శివారులో గురువారం సాయంత్రం పిడుగు పడింది.

వివరాలు ఇలా ఉన్నాయి. పెంట్లవెల్లి శివారులో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద రైతులు వ్యవసాయ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా వర్షం రావడంతో పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లారు. అప్పుడే పెద్ద శబ్ధంతో వంద మీటర్ల దూరంలో ఉన్న గట్టుపై పిడుగు పడడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. పిడుగు పాటుకు రేకుల షెడ్డు ఎదుట నిల్చున్న రామాపురం గ్రామానికి చెందిన శేఖర్ కాళ్లకు తిమ్మిర్లు రావడంతో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





పాలమూరు రంగారెడ్డి లింక్ కెనాల్‌తో కేఎల్ఐకి మహర్దశ

» రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం

» కేఎల్ఐ కింద లక్షా 80 వేల ఎకరాలకు వెసులుబాటు

పాలమూరు రంగారెడ్డి లింక్ కెనాల్‌తో కేఎల్ఐ ఎత్తిపోతలకు మహర్దశ పట్టనున్నది. వట్టెం దగ్గర కేఎల్ఐ 41 కిలోమీటర్ వద్ద లింక్ కెనాల్ ఏర్పాటు చేయడం ద్వారా ఆయకట్టు భూములకు పుష్కలంగా నీరు అందనున్నది. ఇందుకు సంబంధించిన రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అందుకు సానుకూలంగా స్పందన లభించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

నాగర్‌కర్నూల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల (ఎంజీకేఎల్ఐ)కు వట్టెం దగ్గర కేఎల్ఐ 41 కిలోమీటర్ దగ్గర లింక్ కెనాల్ ఏర్పాటు చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు మహర్దశ కలుగనుంది. వరద ప్రవాహం తీవ్రమైనప్పుడు, పంపు హౌజ్‌లో సాంకేతికమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు పంటలను కాపాడుకునేందుకు లింక్ కెనాల్ ఉపయోగపడనుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇరిగేషన్ అధికారులు రూ. 12 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం డీపీఆర్ కోసం ఆదేశించింది.

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ సమీపంలోని కృష్ణానదిపై కేఎల్ఐ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు పక్కపక్కనే ఉన్నాయి. పంపుహౌజ్‌లు, రిజర్వాయర్లు కూడా అక్కడే ఉండటంతో పాటు వాటి కాల్వలు కూడా సమాంతరంగా వస్తున్నాయి. ఈ క్రమంలో కేఎల్ఐకి సంబంధించిన అనేక కాల్వలు పాలమూరు రంగారెడ్డి పథకంలో అంతర్భాగంగా మారి పోయాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన కాల్వలు నిర్మించే క్రమంలో కేఎల్ఐకి సంబంధించిన కాల్వలు విచ్ఛిన్నమయ్యాయి. కేఎల్ఐ ప్రారంభంలో 2 లక్షల 45 వేల ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో ప్రారంభమై రైతులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఆయకట్టు 4 లక్షల 45 వేల ఎకరాలకు చేరింది. ఇందుకోసం 45 టీఎంసీలు అవసరం కాగా ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లు నిర్మించినా వాటి సామర్థ్యం కేవలం 4 టీఎంసీలు ఉండటంతో ఇరిగేషన్ అధికారులు శ్రీశైలం వరద జలాలను చెరువులు, కుంటలకు అందించి కేవలం 2 లక్షల ఎకరాలకు నీరందించగలుగుతున్నారు. డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ కూడా ఇప్పటి వరకు లేదు. కృష్ణానదిలో వరద ఉధృతి పెరిగినప్పుడల్లా కేఎల్ఐ హెడ్‌వర్క్స్‌లో పంపులు మునిగిపోతున్నాయి. కేఎల్ఐ మొత్తం ఆయకట్టుకు సాగునీరందించేందుకు అదనంగా 47 రిజర్వాయర్లు కావాలని సాగునీటి శాఖ అధికారులు ఐదేళ్ల క్రితం ప్రతిపాదించారు. అప్పటి ప్రభుత్వం వ్యాప్‌కోస్ అనే సంస్థకు సర్వే కోసం అనుమతించినా ఈ అంశం ఇంతవరకు దానికే పరిమితమైంది. లింక్ కెనాల్ ఏర్పాటు చేసి కేఎల్ఐలో కొత్త ఆయకట్టును స్థిరీకరణ చేస్తే మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి విస్తృతమైన ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.



వట్టెం దగ్గర గల పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పంపుహౌజ్



కేఎల్ఐ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లింక్ కెనాల్ అందించనున్న వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి నేడు భూమిపూజ

» హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

చిన్నచింతకుంట/బాలానగర్, అక్టోబరు 10: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. ఇందుకు రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రానున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్ మండలం పెద్దాయపల్లి గ్రామంలో మూడున్నర గంటలకు దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామ సమీపంలోని ఎర్రగుట్టలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు మంత్రి భూమిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భూమిపూజకు సంబంధించి గురువారం రాత్రి మండలంలోని దమాగ్నాపూర్ గ్రామంలో కలెక్టర్ విజయేందిరబోయి సంబంధిత అధికారులతో చర్చించి, సూచనలు చేశారు. కలెక్టర్ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్ అండ్ బీ ఈఈ దేశ్యానాయక్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

అలాగే, బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూల్ నిర్మాణం చేపట్టేందుకు గురువారం రాత్రి 9.30గంటలకు స్థలాన్ని పరిశీలించారు.

పాముకాటుతో యువకుడి మృతి



లక్ష్మన్న(ఫైల్)

అయిజ, అక్టోబరు 10: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన యువకుడు బోయ లక్ష్మన్న (24) పాముకాటుతో బుధవారం మృతి చెందాడు. ఆంజనేయులు కుమారుడు బోయ లక్ష్మన్న తమ పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. తమ కుమారుడు డిగ్రీ వరకు చదువుకున్నాడని, ప్రయోజకుడై కుటుంబానికి అండగా ఉంటాడనే తరుణంలో ఇలా పాము రూపంలో మృత్యువు కబళించడంతో ఆ కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. విద్యార్థి మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

లారీ ఢీకొని 50 గొర్రెలు మృతి

దేవరకద్ర, అక్టోబరు 10: లారీ ఢీకొని 50 గొర్రెలు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని గోప్లాపూర్ స్టేజీ దగ్గర చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన కుర్వ పోలయ్య, వెంకటన్నకు కలిపి మొత్తం 400 గొర్రెలు ఉన్నాయి. వీటిని మేపడానికి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లారు. కాగా గురువారం జడ్చర్ల నుంచి తిరిగి తమ స్వగ్రామానికి బయలుదేరారు. గురువారం సాయంత్రం దేవరకద్ర చేరుకొని మక్తల్‌కు బయలుదేరుతుండగా గోప్లాపూర్ స్టేజీ దగ్గర వెనుకనుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే 50 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గొర్రెలకు గాయాలైనట్లు గొర్రెల కాపర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని లారీని, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని వారు తెలిపారు.



అనుమానాస్పద మృతి కేసులో
నిందితుడి అరెస్ట్

వనపర్తి రూరల్, అక్టోబరు 10 : వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి శివారులో బుధవారం మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన దర్యాప్తులో నిందితుడిని రిమాండ్ చేసినట్లు గురువారం సీఐ నాగభూషణరావు వెల్లడించారు. వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన ప్రభాకర్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గాంధీచౌక్‌లోని ఓ వైన్స్ షాప్ వద్ద బత్తిని ప్రభాకర్ మద్యం తాగుడుతుండగా, అదే సమయంలో గోపాల్‌పేట మండలం బుద్దారం దర్మాతండాకు చెందిన శాంతమ్మ మద్యం తాగుతుంది. ఈ క్రమంలో ప్రభాకర్ ఆమెకు డబ్బులు ఆశజూపి బైక్‌పై ఎక్కించుకొని చిమనగుంటపల్లి శివారులోని ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. ఇద్దరు కలిసి మళ్లీ మద్యం తాగారు. ఈ క్రమంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె డబ్బులు అడిగే సరికి చంపి బావిలో తోసేశాడు. మత్తులో ఉన్న ప్రభాకర్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు బుధవారం ఉదయం బావిలో చీర ఉందని, ఎవరో గుర్తు తెలియని మహిళ మృతిచెంది ఉండొచ్చని రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ, సీఐ నాగభూషణరావు సంఘటనా స్థలానికి పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి అక్కడ ఉన్న గ్లాసులు, ఐడీ కార్డులు, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు ప్రభాకర్‌గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

మైనింగ్ మాఫియాను వెంటనే అడ్డుకోవాలి

» రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



మైనింగ్ పనులు చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పౌర హక్కుల సంఘం నాయకులు

బల్మూరు, అక్టోబరు 10 : జిల్లాలో మైనింగ్ మాఫియాను అడ్డుకోవాలని రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుట్టలను నాశనం చేయడం తగదన్నారు. ప్రజల శ్రేయస్సు కోరే ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఈ పనులను ఎందుకు ఆపడం లేదని, అధికారులకు ఎందుకు పట్టడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. మండలంలోని మైలారం గ్రామానికి అనుకుని ఉన్న గుట్టపై చేపట్టిన మైనింగ్ పనులను గురువారం పరిశీ లించారు. అంతకుముందు గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడి మైనింగ్ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఐక్యంగా ఉండి సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం పోలీసులతో చర్చించి గుట్టప్రాంతాన్ని పరిశీలించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు ఉన్నతాధికా రులు చొరవ తీసుకుని మైనింగ్ పనులను ఆపాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎండి.సుబాన్, సహాయ కార్యదర్శి జైపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌చందర్, హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు పీఎం రాజు, కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 10: జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. మునిసిపాలిటీలో 15.5, మండలంలోని తూడికుర్తిలో 28.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా జిల్లాలో అత్యధికంగా పదర మండలంలో 27.8, కల్వకుర్తిలో 25.0, తాడూరులో 21.5, ఉప్పునుంతలలో 16.5, బిజినేపల్లిలో 14.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయం కావడంతో పాటు డ్రైనేజీలు పొంగి పొర్లాయి.

చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

» కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న చెరకు రైతులు

ఆత్మకూరు, అక్టోబరు 10 : స్వామినాథన్ సిఫార్సు ప్రకారం చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆత్మకూరు జోన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏడాదిలో ఎనిమిది నెలలకు రెండు పంటలు పండించి వరి రైతులు క్వింటాల్‌కు రూ.5,600 గిట్టుబాటు ధర ఇస్తున్నారని, చెరకు పంట 12 నెలలు పండిస్తే రూ.3,340 కూడా రావడం లేదన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి గిట్టుబాటు ధర టన్నుకు రూ.5,600 ఇవ్వాల్సి ఉంది. రోజు వారీగా నాలుగు వేల టన్నుల వరకు గానుగ ఆడించాల్సిన కృష్ణవేణి షుగర్ పరిశ్రమ రోజుకు రెండు వేల టన్నులు కూడా ఆడించకపోవడంతో రికవరీ శాతం తగ్గి గిట్టుబాటు ధర రావడం లేదని ఆరోపించారు. టన్నుకు 50 నుంచి 80 టన్నులు వచ్చే మేలు రకమైన సీడ్స్‌ను రైతులకు అందజేయాలని కోరారు. కొత్తకోట బైపాస్ రోడ్డు నుంచి పరిశ్రమ వరకు సీడీసీ నిధుల నుంచి రోడ్ల మరమ్మతు చేయించి రైతులకు రవాణా సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి అరుణ్‌కుమార్, వాసిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ రైతులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 10: అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జా తీయస్థాయికి ఎదగాలని ఒలంపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేష్ సూచించారు. వరంగల్ జిల్లాలో ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు రెండు బంగారు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. గురువారం స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలకు పూర్వవైభవం కోసం కృషి చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కురుమూర్తిగౌడ్, పుట్టి సురేష్‌చందర్, శరత్‌చంద్ర, సాధిక్‌అలీ, సునీల్, శ్రీనివాసులు, రాజు, ధర్మేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థిని



కాత్యాయిని

గద్వాల టౌన్, అక్టోబరు 10 : కేంద్ర ప్రభుత్వం వినూత్న రీతిలో చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి పట్టణానికి చెందిన ప్రగతి పాఠశాల పదో తరగతి విద్యార్థిని కాత్యాయిని ఎంపికైంది. దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, నైతిక విలువల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు భారత నిర్మాణంలో వారు చేయాల్సిన పాత్రపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి వ్యాసరచన పోటీల్లో కాత్యాయిని ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి అవగాహన సదస్సు శిక్షణ శిబిరానికి ఎంపికైంది. రాష్ట్రంలో కేవలం గద్వాల ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికకాగా, అందులో తమ పాఠశాల విద్యార్థిని ఉండటం గర్వకారణమని గురువారం పాఠశాల కరస్పాండెంట్ సవారన్న తెలిపారు. ప్రేరణ సదస్సుకు సంబంధించి శిక్షణ నవంబర్ 22 నుంచి వారం రోజుల పాటు గుజరాత్‌లోని బెర్నాక్యులర్ పాఠశాలలో నిర్వహిస్తారన్నారు. విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ షాహినా బేగం సదస్సులో పాల్గొంటారన్నారు.

ప్రతీ రోజు నడకతోనే ఆర్థ్రైటిస్ దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (వైద్యవి భాగం), అక్టోబరు 10 : ప్రస్తుత సమాజంలో ప్రతీ రోజు నడక తోనే ఆరోగ్యంగా ఉంటారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఆర్థ్రైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'సేవ్ ద జాయింట్స్' నినాదంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. పద్మావతికాలనీ నుంచి ఎస్వీఎస్ ఆసుపత్రి వరకు చేపట్టినా ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థ్రైటిస్ చాలా మందిలో ఉందని, దానిపై అవగాహన లేకపోవడం వలన ఇలా ంటి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీరోజు కొద్ది దూరం నడకతో ఆర్థ్రై టిస్‌ను దూరం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఎస్వీఎస్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎండీ కె.జె.రెడ్డి మాట్లాడుతూ శారీరక శ్రమ, వ్యాయామం చేయకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా ఆర్థ్రైటిస్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణారెడ్డి, రాంరెడ్డి, జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, ముకుందం, ప్రసన్న పాల్గొన్నారు.

యువత ధర్మం కోసం పనిచేయాలి



ఆయుధ పూజలో పాల్గొన్న బజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 10 : యువత హిందూ ధర్మం కోసం పనిచేయాలని బజరంగ్‌దళ్ అధ్యక్షుడు శ్రావణ్, వీహెచ్‌పీ కార్యదర్శి ప్రవీణ్ పిలుపునిచ్చారు. నారాయణపేట అంబాభవానీ ఆలయంలో గురువారం బజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించి, మాట్లాడారు. డాక్టర్ రాంబాబు, మంగళి నర్సిములు, మెలిగిరి కాంబ్లే, సూర్యకాంత్, రామకృష్ణ, వెంకటేష్, విజయ్, ఆకాష్, రాకేష్, రవి, చరణ్, నరేష్, శివాజీ, బాల్‌రాజ్, రితీష్, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట, అక్టోబరు 10 : టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 7.73 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు ఏఎస్ఐ అంజనేయులు తెలిపారు. నారా యణపేట గోపాల్‌పేట రేకుల షెడ్‌లో కర్ణాటక రాష్ట్రం మద్కుల్ గ్రామాని కి చెందిన భీమప్ప నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసు లు గురువారం పట్టుకున్నారు. డీటీ కాళప్ప పంచనామా అనంతరం, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్ల తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ధరూరు, అక్టోబరు 10 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని అల్వాలపాడు చెందిన సవారమ్మ (80) ఈ నెల 3వ తేదీన భర్త సవారన్నతో పాటు పొలానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదవశాత్తూ కింద పడింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో ఆరు రోజులుగా చికిత్స పొందుతుంది. బుధవారం రాత్రి పరిస్థితి విషయంగా ఉండటంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



జడ్చర్లలో గాయపడిన కూలీలను అంబులెన్స్ తరలిస్తున్న సిబ్బంది

జడ్చర్ల, అక్టోబరు 10 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరిధిలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారిలో ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో మహబూబ్‌నగర్ మండలం అమిస్తాపూర్ చెందిన పత్తి కూలీలు గాయపడ్డారు. గంగాపురం సమీపంలో పత్తి తీయడానికి వచ్చిన వీరంతా సాయంత్రం అమిస్తాపూర్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. లింగమ్మ, శ్రీనివాస్‌లకు తీవ్రగాయాలు కాగా, శిరీష, లక్ష్మమ్మ, కొండమ్మ, పరీదాబేగంతో పాటు బొలేరో డ్రైవర్ వెంకటేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు. అలాగే జడ్చర్ల మండలం బూరెడ్డిపల్లి వద్ద కారు, బైకు ఢీ కొన్న ఘటనలో వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం రాజాపూర్ చెందిన కృష్ణ, విజయలకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి రాజాపూర్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. విజయ తలకు తీవ్రగాయం కాగా, చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిండి బ్యాక్ వాటర్‌లో పడి వ్యక్తి మృతి

ఉప్పునుంతల, అక్టోబరు 2 : డిండి బ్యాక్ వాటర్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని కొరటికల్ చెందిన మాధవచారి (45) స్థానికంగా వడ్రంగి పని చేస్తూ జీవించేవాడు. కాగా ఈయనకు వివాహం కాలేదు. తల్లిదండ్రులు గతంలో మృతి చెందడంతో కొంత మతిస్థిమితం లేకుండా ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. కాగా చేపల కోసం కొరటికల్ సమీపంలో డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వద్ద చేపల కోసం గురువారం వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆడపిల్ల పుట్టిందని వేధింపులు

» భర్త, మామపై ఫిర్యాదు చేసిన వివాహిత

కేటీదొడ్డి, అక్టోబరు 10: భర్త, మామ నిత్యం వేధింపులకు గురి చేస్తూ వేధిస్తున్నారని వివాహిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని మల్లాపురం చెందిన అరుణకు 18 నెలల క్రితం మల్లాపురం తండాకు చెందిన కేతావత్ చంద్ర నాయక్‌తో ప్రేమ వివాహం జరిగింది. వారికి రెండు నెలల కూతురు ఉంది. వివాహం జరిగినప్పటి నుంచి భర్త, మామా వేధిస్తున్నారన్నారు. కూతురు పుట్టినప్పటి నుంచి ఎగతాళి చేస్తూ నిత్యం కొట్టేవారని తెలిపారు. ఈ నెల 6వ తేదీన భర్త, మామ కర్రలతో కొట్టడంతో గాయాలయ్యాయని గురువారం పోలీస్ స్టేషన్‌లో అరుణ ఫిర్యాదు చేసింది ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో ఏడుగురికి జైలు శిక్ష

గద్వాల క్రైం, అక్టోబరు 10: దాడికేసులో ఏడుగురు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా వడ్లందొడ్డికి చెందిన కుర్వ జంగిలమ్మకు జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండలంలోని గువ్వలదిన్నె శివారులో పొలం ఉన్నది. 2018, మే 30న జంగిలమ్మ రెండు పొటేళ్లను తీసుకొని గడ్డి మేపడానికి పొలం వద్దకు వెళ్లగా గెట్టు రాళ్ల తీసివేసి ఉన్నాయని, ఆ విషయంపై పక్క పొలం వారు అనంతమ్మ, గోవిందమ్మలను అడిగింది. దీంతో జంగిలమ్మను బూతులు తిడుతూ మేమే రాళ్లను తీసివేసామని, ఏమి చేస్తావని గొడవకు దిగడంతో అదే సమయంలో కుర్వ జంగిలమ్మ ముగ్గురు కుమారులు రాగా వారిని అనంతమ్మ, గోవిందమ్మ, నర్సింహులు, మల్లయ్య, జనార్దన్, విజయకుమార్. వీరేష్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ విషయంపై కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో 2018, జూన్1న కుర్వ జంగిలమ్మ ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి కేసు నమోదు చేసి విచారణ పూర్తి అయ్యాక కోర్టులో చార్జీషీట్ వేశారు. మొదటి అదనపు న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ గురువారం ఏడుగురు నిందితులకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ రెచల్ సంజనా జాషువా, కోర్టు డ్యూటీ అధికారి కోటిని ఎస్పీ అభినందించారు.

నల్లబెల్లం పట్టివేత : కేసు నమోదు

వెల్దండ, అక్టోబరు 10 : అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రం సమీపంలో కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పట్టుకున్నారు. చారకొండకు చెందిన కాట్రావత్ రమేష్ బేగంపేట నుంచి బొలెరో వాహనంలో అచ్చంపేట మండలం సిద్దాపూర్‌కు నల్లబెల్లం తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనంలో 28 బస్తాలలో 840 కిలోల నల్లబెల్లం, 40 కిలోల పటిక, పది లీటర్ల సారా ఉన్నట్లు గుర్తించారు. రమేష్‌పై పోలీసులు కేసునమోదు చేసుకుని, వాహనంతోపాటు అందులో ఉన్న నల్లబెల్లం, పటిక సీజ్ చేశారు.

యజమానికి తెలియకుండానే మరొకరికి భూమి పట్టా

తిమ్మాజిపేట, అక్టోబరు 10 : భూమి యజమానికి తెలియకుండానే మరొకరి పేరు మీద పట్టా చేసిన విషయమై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించి ఆందోళన చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంకు చెందిన సాయికృష్ణ, శ్రీకాంత్, శివకుమార్‌కు ఇప్పలపల్లి శివారులో 3.38ఎకరాల భూమి ఉంది. సెప్టెంబరు 28న మరొకరి పేరు మీద భూమి రిజిస్టర్ అయ్యింది. బుధవారం క్రాప్‌లోన్ విషయమై మీ సేవ కేంద్రానికి వెళ్లగా విషయం తెలిసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి పరిస్థితిని వివరించారు. తమకు సమాచారం లేకుండా మరొకరి పేరు మీద భూమి ఎలా చేస్తారని బాధితులు తహసీల్దార్‌ను అడిగారు. తాను పట్టా చేసిన సమయంలో లేనని గతంలో పని చేసిన తహసీల్దార్ చేసి ఉంటాడని, కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టా అయిందన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

» కుటుంబ సభ్యులను పరామర్శించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

» చెనుగోనిపల్లిలో విషాదఛాయలు

గద్వాల, అక్టోబరు 10 : గద్వాల మండలంలోని చెనుగోనిపల్లికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన ఓ కుటుంబం బుధవారం వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం ఉప్పర్‌పల్లికి పెళ్లి సంబంధం కోసం ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గద్వాలకు వస్తుండగా పెబ్బేరు మండలం రంగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆటో టైర్ పగిలి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమింగా ఉండటంతో కర్నూల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందతూ మొద్దు చిన్నరాముడు (60), మునెన్న(70) బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. పెబ్బేరు పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మృతదేహాలు గ్రామానికి చేరుకోవడంతో విషాదఛాయలు అలుముకన్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరిని కలిసివేశాయి. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా ఇంకా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని గ్రామస్థులు తెలిపారు.

రెండు దుకాణాల్లో నగదు చోరీ

అయిజ, అక్టోబరు 10: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా నందు ఉన్న ఇందు ఐరన్ దుకాణంలో, రాయచూర్ ప్రధాన రహదారి వైపు ఉన్న బాలాజీ ఐరన్ దుకాణంలో చోరీ జరిగింది. బుధవారం రాత్రి దుకాణ యజమానులు తాళం వేసి వెళ్లారు. దుకాణ వెనుక భాగంలో ఇనుపరేకులకు ఉన్న బోల్టులను ఊడదీసి లోపలికి వెళ్లి నగదును ఎత్తుకెళ్లారు. ఈ రెండు దుకాణాలలో దాదాపు రూ.లక్ష వరకు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఎస్ఐ విజయ్‌భాస్కర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

గద్వాల క్రైం, అక్టోబరు 10 : గద్వాల మండలంలోని చెనుగోనిపల్లికి చెందిన బాలుడు గోవర్ధన్ రెండు రోజుల క్రితం అదృశ్యమయ్యాడని తల్లి బజారమ్మ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. బాలుడి ఆచూకి కోసం మంగళవారం నుంచి గాలించగా గురువారం గద్వాల మండలంలోని వీరాపురంలో గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. బాలుడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వెళ్లిపోవడం జరిగిందన్నారు. గురువారం సాయంత్రం తల్లి బజారమ్మకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

» మంటలు చెలరేగి దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మాగనూరు, అక్టోబర్ 10 : ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. కారులో ఉన్న ఏడుగురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ గురువారం తెల్లవారుజామున నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో చోటు చేసుకుంది. కాగా కారు చెట్టును ఢీకొట్టిన వెంటనే అందులో ఉన్న వారు బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణ ప్రసాద్ ఫైర్ స్టేషన్‌కు తెలుపగా, వారు మంటలను అదుపులోకి తెచ్చారు. కారులో ప్రయాణిస్తున్న వారు ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన వారిగా గుర్తించారు. కర్ణాటకకు వెళ్తుంటే ప్రమాదం జరిగిందని తెలిసింది.

బావిలో పడి ఎద్దు మృతి

మాగనూరు, అక్టోబర్ 10: నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని తాళంకేరిలో గద్దిగూడెం అంజప్పకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. అంజప్ప రోజు మాదిరిగానే ఎద్దులను మేపేందుకు పొలం వద్ద వదిలాడు. గడ్డి మేస్తూ ఎద్దు బావిలో పడింది. ఎద్దు విలువ రూ.60వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యుదాఘాతంతో ఆరు గొర్రెలు మృతి

రేవల్లి, అక్టోబరు 10 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం గౌరిదేవిపల్లిలో గురువారం ఆరు గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన దొడ్డి కుర్మయ్య గొర్రెలను మేపటం కోసం సమీప పొలం వద్దకు తీసుకెళ్లాడు. మధుసూదన్‌రెడ్డి పొలంలోని నియంత్రిక కంచె వద్ద ఏర్పాటు చేసిన ఎర్త్ వైర్‌కు షాక్ రావటంతో ప్రమాదవశాత్తు తగిలి ఆరు గొర్లు అక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.90 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ముద్దబంతి విరబూసేనండి..

వనపర్తి పట్టణంలోని మర్రికుంట సమీపంలో ఓ రైతు తన పొలంలో బంతిపూలను సాగు చేశారు. ఈ పూలు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల కోసమే అన్నట్టుగా విరబూసి.. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలు ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి





మానసిక ఒత్తిడితోనే అనారోగ్య సమస్యలు

- సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత

కందనూలు, అక్టోబరు 10 : మానసిక ఒత్తిడితోనే అనారోగ్య సమస్యలు వస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి సబిత అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక వ్యాధి అనేది అన్నిరకాల ఆరోగ్య సమస్యల్లాంటిదే అన్నారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోయి మానసిక రోగిగా మారే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ రఘు, వైద్యులు రవిశంకర్, వెంకటదాస్, శ్రీనివాసులు, అంబుజ, న్యాయవాదులు మధుసూదన్‌రావు, బ్రహ్మేశ్వర్, శ్యాంప్రసాద్‌రావు, రాంబాబు, బి.రామచంద్ర, కుమార్, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధ, వాహన పూజ

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 10 : జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా పండుగ సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆయుధ పూజ, వాహన పూజలు చేశారు. కార్యక్రమంలో ఆడిషనల్ ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏడీడీఎల్ఎస్పీ టి.భరత్, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్య, అడ్మిన్ ఆర్ఐ జగన్, ఎంటీవో ఆర్ఐ రాఘవరావు, ఎస్ఐ గోవర్దన్, ఆర్ఎస్ఐలు గౌస్‌పాషా, కల్యాణ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూజలు

కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో..

కల్వకుర్తి, అక్టోబరు 10: కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నవరాత్రుల్లో భాగంగా ఆపరేషన్ థియేటర్, సాధారణ కాన్పుల గదిలో వైద్యులు, సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు.అనంతరం సద్దుల బతుకమ్మ ఘనంగా వైద్యులు, సిబ్బంది బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం మాట్లాడుతూ సిబ్బందికి మానసిక ఒత్తిడిని తగ్గించడానికి పండుగలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు యశోదబాయ్, సుష్మ, స్వప్న, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే పైలెట్ ప్రాజెక్టు పూర్తి

- ఆర్డీవోలు, తహసీల్దార్లు, పుర కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులతో సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్
- సర్వేలో గుర్తించిన సమస్యలు, కుటుంబ వివరాల నమోదుపై చర్చ



పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను ప్రామాణికంగా తీసుకుని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నిగ్రామాల్లో నిర్వహించే కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, దేవసహాయంతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో డిజిటల్ కార్డుల సర్వేపై సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు ద్వారా నిర్వహించిన డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియలో గుర్తించిన సమస్యలు, కుటుంబ వివరాల నమోదు తదితర వివరాలపై అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీల్లో నిర్వహించే కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను పైలెట్ ప్రాజెక్టుద్వారా చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వేను ప్రామాణికంగా తీసుకుని జిల్లాలో విజయవం తంగా డిజిటల్ కార్డుల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజలకు మెరుగైన సేవలందించాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన పలువురితో మాట్లాడి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వలపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదవుతుందని మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ వంటి రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో సౌమ్యంగా మాట్లాడాలని సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు - పాల్గొన్న కలెక్టర్, అధికారులు - రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద బతుకమ్మలకు పూజ చేస్తున్న కలెక్టర్ సంతోష్



ఊర్కొండలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న అధికారులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తెలంగాణలో బతుకమ్మ పండుగ నిలుస్తుందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు కే.సీతారామారావు, దేవసహాయంతో కలిసి గౌరీమాతకు పూజలు నిర్వహించి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలకరించిన బతుకమ్మలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బతుకమ్మ పండుగ మన వారసత్వ పండుగ అన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమని ప్రకృతిలో లభించే పూలను సేకరించి అందంగా బతుకమ్మ పేర్చి పూజిస్తారని చిన్న పెద్దలందరూ తొమ్మిది రోజుల పాటు పాడుకుంటూ బతుకమ్మ ఆడుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధికారులు, అన్ని కార్యాలయాల మహిళా సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఊర్కొండలో బతుకమ్మ సంబురాలు

ఊర్కొండ : మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంతిపూల బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి రామస్వామి, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు, నాయకులు ఆరిఫ్, గణేష్, రఫీక్ తదితరు లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

చారకొండ, అక్టోబరు 10: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ జానకిరాంనాయక్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు శేఖర్, శ్రీను, తిమ్మాయిపల్లి బాలు నాయక్, వెంకటయ్య, చందులాల్, చారకొండ కట్టర్స్ శ్రీశైలం పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



కల్వకుర్తిలో దుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీమాత



మన్ననూరులో దుర్గామాతకు భక్తుల పూజలు



పాలెం వెంకన్న ఆలయంలో దుర్గామాతగా అమ్మవారు

కల్వకుర్తి, అక్టోబరు 10 : కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి, గురువారం 8వ రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రవేత్తంగా నిర్వహించారు. చండీయాగంలో దంపతులు పాల్గొన్నారు. అమ్మవారిని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఉప్పల వెంకటేశుని ఉత్సవ కమిటీ సభ్యులు పూల మాలలతో సత్కరించారు.

బిజినేపల్లి : మండల కేంద్రంతో పాటు పాలెం, వట్టెం, మంగనూర్, లట్టుపల్లి, మహదేవునిపేట గ్రామాల్లోని మండపాల్లోని కొలువుదీరిన అమ్మవారిని గురువారం ఎనమిదో రోజు దుర్గామాతగా అలంకరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. కుంకుమార్చన, అభిషేకాలు, మహా హరతి, సామూహిక గీతాలపనలు మహిళ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలెంలో వాంటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవారి మండపం వద్ద అన్నదానం చేశారు. ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకన్న ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి మాజీ సర్పంచ్ లావణ్య, నాగరాజు దంపతులు పూజలు చేశారు.

మన్ననూర్ : అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, ప్రశాంత్‌నగర్, మాచారం , తుర్కపల్లి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాల ప్రదర్శన, మహిళల బతుకమ్మ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలకమండలి సభ్యురాలు సంభు శోభ, మార్కెట్ డైరెక్టర్ నంది హన్మంత్ రెడ్డి, ఉత్సవ కమిటీల సభ్యులు జయమ్మ, ప్రభావతమ్మ, దీపిక, సరస్వతి, పద్మజ, శేఖర్, సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, రమేష్, సురేష్, వెంకటేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

చారకొండ, అక్టోబరు 10: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూర్ జానకి అన్నారు. గురువారం మండలంలోని తుర్కలపల్లి, సారంబండతండా గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకు లు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, చంద్రారెడ్డి, క్రిష్ణ, సందీప్, శ్రీరామ్, మహేష్‌రెడ్డి, శరత్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 10 : యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని సాతాపూర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తాలూకా స్థాయి కబడ్డీ పోటీలను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మనిషికి మానసిక ఉల్లాసంతోపాటు శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందించిందన్నారు.

యువత క్రీడల్లో రాణించి గ్రామానికి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ సతీష్, మాజీ ఎంపీటీసీ నారాయణరావు, క్రీడా నిర్వాహకులు శివరాజేశ్వర్ రావు, అర్జున్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు పి.చిన్నయ్య, కుందేల పద్మమ్మ, రాంలాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నరసింహ, వడ్డె వెంకటయ్య, నాయకులు గోపాల్‌రావు, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి వైద్యాధికారి పూజలు

కందనూలు, అక్టోబరు 10 : జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 54వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గురువారం జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మీ దంపతులకు నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చండీయాగం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో గల శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయంలో దేవిశరన్నవరాత్రి దుర్గామాత ప్రత్యేక పూజలల్లో 8వ రోజు అమ్మవారిని మహాదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దొడ్ల ఇందుమతి, ఎలిమే ఈశ్వరయ్య సహాయ అర్చకులు ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు. జయశంకర్‌కాలనీలో మహాలక్ష్మీ హోమయాగాలు 15మంది దంపతులతో నిర్వహించారు. రాఘవేంద్ర కాలనీలో దుర్గాదేవి బృందం మహిళలచే ఒడిబియ్యం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా



లట్టుపల్లిలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో నీతిరెడ్డి

బిజినేపల్లి, అక్టోబరు 10 : రైతులకు అవసరమైన యూరియా 287 మెట్రిక్ టన్నులు ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉందని ఏవో నీతిరెడ్డి అన్నారు. మండలంలోని పాలెం, లట్టుపల్లి, వట్టెం, బిజినేపల్లిలోని ఎరువుల దుకాణాల్లో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిల్వలను, రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 60 మెట్రిక్ టన్నులు, ఆగ్రో సేవా కేంద్రంలో 49 టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 178 టన్నుల నిల్వలు ఉన్నట్లు తెలిపారు. లట్టుపల్లిలో ఎక్కువ మొత్తంలో యూరియా కొనుగోలు చేసిన ముగ్గురు రైతులను గుర్తించి క్షేత్రపరిశీలన చేసి వివరాలు నమోదు చేశామన్నారు.

జూనియర్ అసిస్టెంట్ తొలగింపు

- కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయ ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు
- విచారణ అనంతరం కలెక్టర్ ఉత్తర్వులు జారీ

కొల్లాపూర్, అక్టోబరు 10 : కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయంలో అవుట్ సోర్సింగ్‌పై జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొండల్‌రావు అనే ఉద్యోగిని శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీవో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల నుంచి జూనియర్ అసిస్టెంట్ కొండల్‌రావుపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సమగ్ర విచారణ జరిపిన కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఉన్న కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజును సస్పెండ్ చేసి రెండు రోజులు గడవక ముందే అదే కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవడం కొల్లాపూర్‌లో చర్చనీయాంశంగా మారింది.

బాధ్యతలు చేపట్టిన కొల్లాపూర్ ఆర్డీవో



బాధ్యతలు స్వీకరిస్తున్న యాదగిరి

కొల్లాపూర్ : కొల్లాపూర్ ఆర్డీవోగా యాదగిరి పదవీ బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడమే ధ్యేయంగా పని చేస్తామన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కందనూలు, అక్టోబరు 10 : మానసిక ఆరోగ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మనసు బాగుంటే ఆనందం మీ వెంటే ఉంటుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మీ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తే ప్రాథమిక స్థాయిలోనే నివారించవచ్చునని వ్యక్తుల ప్రవర్తనలో మార్పులను గమనించి చికిత్సలు చేయించడంలో కుటుంబ సభ్యుల పాత్ర ముఖ్యమని తెలియజేశారు.

'ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలి'

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 10 : సమాజంలో ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కూచకుళ్ల దామోదర్‌రెడ్డి వైద్య కేంద్రం కోఆర్డినేటర్ కే.రాజు, సూపర్‌వైజర్ వెంకటయ్య అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్దకొత్తపల్లిలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్ర కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నేత్ర వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలనారాయణ, వెంకటస్వామి, నానియా, నరేష్, సురేష్, హాజీ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

పెంట్లవెల్లి, అక్టోబరు 10: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు చిట్టెమ్మ, లక్ష్మి, బాలరాజు, కాశీం, ఈశ్వరమ్మ, రామస్వామి ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బిజినేపల్లి, అక్టోబరు 10 : మండలంలోని మంగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 21సంవత్సరాల తర్వాత కలుసుకున్న బాల్యమిత్రులు గత స్మృతులను గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. తరగతి గదిలో తోటి మిత్రులతో, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకొని కొందరు కన్నీటి పర్వతమయ్యారు. కార్యక్రమంలో కురుమూర్తి, స్వామి, మల్లికార్జున్, మోహన్, సురేష్, పర్వత్‌రెడ్డి, కృష్ణయ్య, రాజేష్, తిరుపతయ్య, సుధాకర్ నవిత, రాధ, జ్యోతి, మల్లీశ్వరి, సాయిలీల తదితరులు ఉన్నారు.

కారుతో ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బల్మూరు, అక్టోబరు 10 : కారుతో ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ఆ వివరాలు.. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుందని తెలిపారు. అచ్చంపేటకు చెందిన మహమ్మద్ అన్వర్ అతని మిత్రుడు అభిలాష్ పల్సర్‌బైక్‌పై బల్మూరు వెళ్తుండగా పట్టణ సమీపంలో కల్వర్టు దగ్గర ఎదురుగా వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అన్వర్ కుడికాలు విరిగిపోగా, అభిలాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108ద్వారా అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అన్వర్ తమ్ముడు ఆసీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

అచ్చంపేటటౌన్, అక్టోబరు 10: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంతటి నారాయణను గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, జంగిరెడ్డి, ప్రభాకర్, కుమారస్వామి, సాయిలు, జగాల్ రెడ్డి పాల్గొన్నారు.